సహాయం అర్థిస్తున్నట్లు మానేజరువంక చూశాడు రమేష్. ఒక్కసారి అతనివంక అదోలా చూసి-అంతలోనే దృష్టి మరోవైపుకి మరల్చుకున్నాడు మానేజరు.

రమేష్‌కి అతని భావం అర్థమైపోయింది

ఆశ అణగారిపోగా - పరాజితుడిలా తలవంచుకున్నాడు.

కస్టమర్ తాలూకు పాదాలు అతి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రమేష్ కన్నుల ముందు - జీవితం ఒకసారి భయంకరమైన కోరదాని ఝళిపించి బెదరించినట్లయింది.

"సైజు సరిపోతుంది. లేసులు బిగించు." కుర్చీలో విలాసంగా కూర్చున్న కస్టమర్ అధికారం చలాయిస్తూ ఆజ్ఞ జారీచేసి-పాదాలను మరింత ముందుకు జాపాడు.

రమేష్ గుండెలు జలదరించాయి.

ఒక్కసారి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

ఆ పాదాలు....వాటిని తను ముట్టుకోవాలి!




ఆవేశం ఆపుకుని-మనసుకి కళ్ళాలు వేసి గట్టిగా బిగించి-ఎలాగో కర్తవ్యం నిర్వహించాడు.

"నైస్....థాంక్యూ" కస్టమర్ హుందాగా అడుగులు వేస్తూ కౌంటర్‌వద్దకు నడిచాడు.

మానేజర్ దూరంగా జరిగిపోగా-విధిలేనట్లు బిల్ బుక్ అందుకున్నాడు రమేష్.

ఎభై రెండు రూపాయల ఎనభై పైసలు!

సేల్స్ పూర్తయ్యాక - సేల్స్‌మెన్ పెదవులపై నర్తించే కృతజ్ఞతాపూర్వకమైన మందహాసం రమేష్ పెదవులపై వికసించలేదు.

"మీ పేరు" యాంత్రికంగా అడిగాడు.

పాడుపడిన నూతి అడుగునుంచి-జీవి

తపు అట్టడుగు మెట్టుమీదనుంచి వస్తున్నట్లు రమేష్ కంఠం చాలా అసహజంగానూ బలహీనంగానూ వుంది.

గర్వంగా బదులు చెప్పాడు కస్టమర్. అతను మాత్రం విజయం పొందినట్టు నవ్వుతున్నాడు.

ఓడిపోయిన మనిషిలా నీరసంగా బిల్ అందించి డబ్బు తీసుకొని కౌంటర్‌లో వేశాడు రమేష్.

పెద్ద సేల్ ముగించిన సంతోషం అతని ముఖంలో ఛాయా మాత్రంగా అయినా లేదు. రాబోయే కమిషన్ అంకె అతని కన్నులను కొంచెమయినా కాంతివంతం చేయడం లేదు. అతని ముఖంలో కనీసం ఆశ తాలూకు చిహ్నాలుకూడా లేవు.

జీవితంలో అతి ముఖ్యమైన దేమిటో కోల్పోయినట్లు; చేదు నిజాలు ఆకళింపు చేసుకుంటున్నట్లు, విలువలు కోల్పోతున్నట్లు- దీనంగా చూస్తూ అక్కడే నిలబడిపోయాడు.

ఆ కన్నులలో ప్రాణంలేని మేఘాలవంటి దట్టమైన అసంతృప్తి. అతని శరీరం - వేలకొలది గొంగళి పురుగులు ప్రాకుతున్నట్లు జలదరిస్తోంది.

ఏమిటీ బ్రతుకు?

రమేష్‌కి దుఃఖం వచ్చేస్తోంది.

“కంగ్రాట్స్....మంచి సేల్ కంప్లీట్ చేశావు” మానేజర్ అభినందించాడు.

పుండు మీద కారం జల్లినట్లనిపించింది రమేష్‌కి.

“చాలా డిప్రెస్ అయినట్లున్నావ్.... వెళ్ళి టీ తీసుకురాకూడదూ!”

సానుభూతి చూపుతున్నట్లున్నాడు మానేజర్.

కనీసం - కృతజ్ఞతలయినా చెప్పలేదు రమేష్. అసహాయతలోంచి వచ్చే ఆవేశంతో అక్కడినుంచి బయటపడ్డాడు.

అడుగులు-విసురుగా, కోపంగా.

ఆ కోపం- మానేజర్ మీద కాదు.

కస్టమర్ మీదకూడా కాదు.

తనమీద!

తన జీవితం మీద!!

కొన్ని క్షణాల్క్రితం జీవితం తనపై ఆడిన అతి దారుణమైన ఆటమీద!!!

ఏం బ్రతుకిది

ఎందుకొచ్చిన బ్రతుకు!

అలవాటుగా సాగుతూంది నడక.

మనసునిండా కోలాహలం.

మెట్లెక్కుతూ - హఠాత్తుగా ఆగిపోయాడు.

సరిగ్గా ద్వారంపైన-అట్టే పెద్దదికాని అట్టమీద అతి స్పష్టంగా, అందవికారంగా అక్షరాలు.

‘అంటు రోగులు లోపలికి రాకూడదు’

ఎందుకో మళ్ళీ చదివాడు.

దెబ్బతిన్నట్లు అటూ ఇటూ చూసి- నేరస్తుడిలా నడుస్తూ లోపలకు వెళ్లాడు.

ఖాళీగా వున్న కుర్చీలో కూలబడ్డాడు.

పరిచితుడైన సర్వర్ పిలవకుండానే పరుగెత్తుకు వచ్చాడు.

కర్కశఠోరమయిన తినుబండారాల దంతకంతో రమేష్ ప్రాణాలు తియ్యకుండా- మృదువుగా అడిగాడు. "ఏం కావాలి సార్?"

"ఓ గ్లాసెడు వేడినీళ్ళు."

మూఖం చిన్నబుచ్చుకుని వినయంగా అన్నాడు సర్వర్. "నిన్న - టీ మాస్టర్ శలవు. అందుచేత టీ పాడై ఉండవచ్చు. కొత్తవాడికి ఏమీ చేతకాదు. ఇవాళ నేను స్వయంగా వేసి తెస్తాను. మీరే చూస్తారుగా? స్పెషల్ టీ...."

"మిస్టర్— నాకు టీ కావాలి. కాని- నిజంగా వేడినీళ్లు కూడా కావాలి. ప్లీజ్."

ఒకసారి చిత్రంగా చూసి వెళ్ళిపోయాడు వాడు.

మనసులోని ఆలోచనా వాహినికి ఆనకట్ట వేయాలని ప్రయత్నిస్తున్నట్లు నలువంకలా దృష్టి సారించాడు రమేష్. నిజానికి కతనా హోటల్‌కి చాలా అలవాటు పడిపోయిన దది. కాని-యివాళ అతనికి అంతా కొత్తగా కనిపిస్తోంది

గోడకు తగిలించిన అద్దంమీద సున్నంతో వ్రాయబడిన 'టు డే స్పెషల్' వింతగా మెరుస్తున్నాయి.

ప్రక్క గోడమీద నాలుగు క్యాలెండర్లు. రెండు ప్రకృతి దృశ్యాలు ఒకటి పి మరోటీ, నిజంగా చిత్రించలేనంత అందమైన భంగిమకి చిత్రకారుడు తీర్చిదిద్దిన తమాషా అయిన నమూనా, నాలుగవ క్యాలెండర్‌లో స్త్రీ వస్త్రధారణ విషయంలోనూ, శీలరక్షణలోనూ స్త్రీ ఎంత పొదుపుగా వుండవచ్చునో తెలుపుతూందా అన్నట్లు-ఆ సినీ ఎక్స్ట్రా. కప్పుకున్న గుడ్డపేలికలు తరిగిపోయిన సంఖ్య కావడాన- ఒంటి వొంపులు ఏ మాత్రమూ దాగడంలేదు. ఆ బొమ్మలోని గుమ్మ— అటు పొదుపుకీ, ఇటు సెక్సపీలుకీ ప్రచారం యిస్తున్నట్లుంది,

"ఇచ్చట తీపి పదార్థములు డాల్డా తోనూ, కారపు సామానులు రిఫండాయిలుతోనూ చేయబడును.. ఓ అడ్వర్టయిజ్‌మెంట్— విలాసంగా, హాయిగా బ్రతకాలంటే వాడండి దర్బార్ బత్తి.'

'సినీ తారలు మెచ్చుకునే సిగరెట్' విజాతీయ చలన చిత్ర తారామణి.

ఆ మూల....మళ్ళీ 'అంటు రోగులకు ప్రవేశము లేదు'

ఉలిక్కిపడ్డాడు రమేష్.

ఆ బోర్డు గేటుముందుంటే చాలుగా? మళ్ళీ యిక్కడ దేనికి?

అయినా - తిండి తినే హాలులో యీ వెధవ బొమ్మలూ అడ్వర్టయిజ్‌మెంట్లూ ఏమిటీ? హాయిగా ప్రశాంతంగా ఉండనీయక

ఇన్నాళ్ళూ తను వీటిని పట్టించుకోలేదు.

అప్పుడు. టేపరికార్డర్ నుంచి మెల్లగా యీ స్టటిక్ సెన్సేషను పాడుతోంది. అంతా మెకానికల్‌గా.

"చలి చంపుతుంటే ఫ్యాను దేని

కయ్యాళి కట్టియ్యి." ఓ మూలనుంచి కర్కశంగా ఆజ్ఞ.

సర్వర్ వేడినీళ్ళు తెచ్చాడు.

హటాత్తుగా ఏదో ఆలోచన వచ్చి వట్లడిగాడు రమేష్. "మిస్టర్, నువ్వు చదువుకున్నావు కదూ?"

"స్కూల్ ఫైనల్ ప్యాసయ్యాను. ఏదయినా మంచి ఉద్యోగం చూసి పెట్టమని మీకు చెప్పానుకూడా."

"అవును...సరేగాని....ఆ రోడ్డు.... అదే....అంటు రోగులకు...." నీళ్ల నమిలాడు రమేష్.

"ప్రవేశం లేదు సార్" వినతగా చూశాడు సర్వర్.

"ఎవరయినావస్తే....మాట వరసకి.... ఎవరయినా నీ టేబులు దగ్గరికి వచ్చి కూర్చుంటే...."

"మానేజర్ గేటు ముందరే ఆపే స్తాడు కదా!"

"పొరపాటున-మానేజర్ చూడక—ఏ పెద్దమనిషో వచ్చాడనుకో..."

"మర్యాదగా వెళ్ళి పొమ్మంటాను సార్."

"వెళ్ళనంటాడు."

"మానేజర్‌తో చెప్పి పంపించేస్తాను. ఏమిటిసార్ మీరివాళఅన్నీ చిత్రంగా...."

"అంతేకాని నువ్వతనికి సప్లయ్ చేయ నన్నమాట."

"సర్వర్లమే అయినా మేమూ మను షులమే. మాకూ ఆరోగ్యమూ శుచి శుభ్రతయూ అవసరమే. మేము మాత్రం మనుషులం కామూ?"

"అబ్బే....ఏమీలేదు. వెళ్లి స్పెషల్‌గా చేసి టీ పట్రా." వేడినీళ్ల గ్లాసుతో వాష్ బేసిన్‌వైపు నడిచాడు రమేష్.

చల్లని వాతావరణంలో వెచ్చని నీరు పడగానే హాయిగా అనిపించింది. శరీ రంతోపాటు మెదడుకూడా క్షణికమయిన సాంత్వన పొందింది.

ఒక్కసారి చేతులవంక చూసుకునే సరికి —

పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. రెండు చేతులూ నరికేసుకోవాలన్నంత ఉద్రేకం కలిగింది రమేష్‌లో. అంత ఉద్రే కాన్ని ఆపుకుని వచ్చి కుర్చీలో కూర్చు న్నాడు.

ఆవిర్లు గ్రక్కుతున్న టీ కప్ తెస్తు న్నాడు సర్వర్.

ప్రాణం లేచి వచ్చినట్లు ఆత్రుతగా మునుముందుకు వొంగాడు!

ప్రక్క టేబుల్ దగ్గరలో "మసాలా దోశె డబల్‌రోస్టు...అర్జంటుగా రెండిడ్లీ" ఆకలిగొన్న మానవుడి తాలూకు ఆరా టపు కేక.

ఎంత ఆకలి!

జాలివేసింది రమేష్‌కి.

సర్వర్– టీ కప్పు, సాసరూ టేబిలు మీద పెట్టివెళ్లాడా పక్కకి.

ఒక సిప్ తీసుకునేంతలో....పక్క టేబుల్‌దగ్గర సర్వర్ కంఠం. .కర్కశంగా




....ఆవంక చూశాడు.

టీ కప్పు చేతిలోంచి జారినంత పనయింది.

మెల్లగా కప్పుని సాసర్లో ఉంచేసి గట్టిగా కళ్లు మూసుకున్నాడు.

తల తిరుగుతోంది.

కడుపులో దేవుతోంది.

ఒక్క క్షణ ఉండాలనిపించడంలేదు రమేష్‌కి.

పారిపోవాలనుకున్నాడు.

కాని- ఏదో కుతూహలం.

ఈ విషమ పరీక్ష నెలా ఎదుర్కొంటాడు సర్వరు?

కుతూహలంకొద్దీ కూర్చున్నాడు రమేష్.

క్లీనర్‌ని పిలిచి టీ కప్పు తీసెయ్యమన్నాడు.

జరుగుతున్న గలాభాని సర్దివెయ్యాలని కాటోలు మానేజరు వచ్చాడక్కడికి.

"ఈయన?...." సర్వర్ కంఠం.

"అబద్ధం....అంతా వొట్టిది...."

"ఏమీ కాదు. పాసింజర్ చేతులు చూడండి..."

(హోటల్‌కి వచ్చేవాళ్ళని సర్వర్లు పాసింజర్లంటారు)

"అదంతా మీ కనవసరం. నాకు కావల్సింది తిండి. మీకు కావల్సింది డబ్బు అందరిలాగే - కావాలంటే [illegible]కంటె ఎక్కువగానే డబ్బిస్తాను. నాకు ఆకలి వేస్తోంది....".

మృదువుగా- వ్యాపారస్తునిలా సానునయంగా చెప్తున్నాడు మానేజరు. 'మీరు పెద్దవారు. అన్నీ తెలిసినవారు. మాకు చెప్పవలసినవారేకాని మాచేత చెప్పించుకోదగిన వారు కాదు. మా బాధ మీరు అర్థం చేసుకోగలరు. చుట్టూ చూడండి. టిఫిన్ తినుటనేవాళ్ళందరూ చేతులు కడిగేసుకుంటున్నారు. దయచేసి....''

అందరూ అతనివంకే చూస్తున్నారు.

మానేజరూ, సర్వరూ అతనికి వీలైనంత దూరంలో నిలబడి ఉన్నారు.

క్లీనర్లు హడావిడిగా నాఫ్తలిన్ కలిపిన నూనెలో గుడ్డలు ముంచి టేబుల్సు తుడుస్తున్నారు.

ఫ్యానులన్నీ తిరుగుతున్నాయ్.

నలుమూలలా సాంబ్రాణి పొగలు... అగరు ధూపాలు....

ఒక మనిషినుంచి రక్షణకోసం జరుగుతున్న ఆర్భాటం ఎక్కువగానే ఉంది.

అందరి దృష్టియూ అతనిపైనే. చూడటానికి చాలా ధనవంతుడిలా వున్నాడు. ముఖంలో చాలభాగం దాచుతూ పంజాబీలా గెడ్డానికి చుట్టూ పెద్ద రుమాలా, పొడుగు చేతుల చొక్కా. చేతులను టేబుల్ కింద దాచుకుంటున్నాడతను.

రమేష్‌కి అతనిమీద జాలేసింది. ఇటువంటి సన్నివేశంలో ముఖ్యపాత్ర ధరించవలసిరావడంకంటే దారుణమయిన శిక్ష మరొకటేముంటుంది సున్నితమైన మనిషికి.

సర్వర్ గొంతు కఠినంగా ఉంది.

"చదువుకున్నవారిలాగే వున్నారు లోపలా బయటా అంటురోగులకు ప్రవేశంలేదని బోర్డులు కట్టాం- చూడలేదూ? రైటాఫ్ అడ్మిషన్ రిజర్వ్‌డ్ అనికూడా వ్రాశాం. చూడండి... మీరు మా బిజినెస్‌కి చాలా నష్టం కలిగిస్తున్నారు. మర్యాదగా వెళ్ళకపోతే పోలీసులను పిలువవలసివుంటుంది''

పాసింజర్ కొంచమయినా చలించలేదు.

కుర్చీకి అంటుకుపోయినట్లు కూర్చున్నాడు.

"పోనీ, ఆ స్పెషల్ రూములోకూర్చోబెట్టి కావలసిందేదో యిచ్చి పంపెయ్యకూడదూ?'' సూచించాడు మానేజరు.

సర్వర్ ఖచ్చితంగా చెప్పాడు. "నేనే కాదు. ఎవరూ సర్వ్ చెయ్యరు, మేమూ మనుషులమే.'

"మీరు మనుషులు కారు. మనుషులయితే యిలాగ ప్రవర్తించరు''

కోపంగా లేచి నిలుచున్నాడు పాసింజరు.

ఇప్పుడతని శరీరంలో కొంతమేర అతి స్పష్టంగా అనాచ్ఛాదితంగా కనిపిస్తోంది.

పొంటేమీద- పొడపాముమీది మచ్చలవంటి మచ్చలు, చెదలు తినేసినట్లున్న చర్మం. చాలా వికృతంగానూ అసహ్యాంగానూ ఉందతని రూపం.

ఆ వ్యాధి బహుశా కుష్టుకానీ, బొల్లికానీ అయి వుండవచ్చును.

సిల్కు- చొక్కా, బంగారు ఉంగరాలూ

రీదయిన వాటి—ఏవీకూడా అతని జుగుప్సాకర రూపాన్ని దాచలేక పోతున్నాయి. ఆ వేళ్ళతో ముట్టుకున్న పదార్థాలు అతనే తినలేడేమో! బహుశా స్పూన్‌తో తింటాడు.

ఆ పాసింజర్ విసురుగా వెళ్ళిపోయాడు.

మానేజరు రమేష్ దగ్గరకు వచ్చి- "సారీసార్. మీరా స్పెషల్ రూములో కూర్చోండి. టీ పంపిస్తాను" అన్నాడు నమ్రత కురిపిస్తూ. అది వ్యాపారలక్షణం.

"అవసరం లేదు!" అని లేచాడు రమేష్. ఇక అతనికి టీ తాగ బుద్ధికాలేదు. విజేతలా నవ్వుతూ ఎదురైన సర్వర్ "అతన్ని పంపించేశానుగా? మీరు కూర్చోండి. మళ్ళీ టీ తెస్తాను" అన్నాడు రమేష్ నుద్దేశించి.

"ఊహుఁ వద్దు" తల సంకించి నడిచాడు రమేష్.

సర్వర్-నువ్వు గెలిచావు అనుకోకుండా వుండలేకపోయాడు - హోటల్ మెట్లు దిగుతూ.

ఇంకా చీకటి పడలేదు.

కోర్టులో అబద్ధపు సాక్షులమల్లె లేని చీకటిని నిరూపించడానికి రోడ్డు పక్క షాపులలో రంగు రంగుల దీపాలు వెలుగుతున్నాయి. అది వ్యాపారం.

గడచిన సంఘటన కొత్త కోణాలలో కనపడుతూంది. సర్వర్ ఘన విజయంలో తన పరాజయం!

త్రుళ్ళిపడ్డాడు రమేష్.

అతని మెదడులో మెత్తని ముడతలు మెల్ల మెల్లగా విడుతున్నాయి.

ఏవో వాడి అయిన శ్రావణాలు (ఫోర్ సెప్స్) మెదడు మారుమూలల నుంచి భయంకరమయిన ఆలోచనలను పైకి లాగుతున్నాయి.

పరిపరివిధాల పోతోంది మనస్సు.


మెదడూ, మనిషీ స్వాధీనం తప్పేలా ఆలోచనలు.

షాపు దాటి వెళ్తుంటే—

మానేజర్ కేక వేశాడు.

రమేష్‌కి అది వినిపించలేదు.

వినిపించినా మళ్ళీ ఆ షాపులోకి

Bensons-2141-TEL

అడుగుపెట్టే ఉద్దేశం ఉన్నట్లు లేదు రమేష్‌కి.

రోడ్డు చాలా రద్దీగా వుంది. దేశంలో విపరీతంగా పెరిగిపోయిన జనాభాకి ప్రత్యక్ష నిదర్శనంలా కంట్రోల్ కానంత ట్రాఫిక్. అమితంగా పెరిగిన నాగరికత తాలూకు రొద. కల్మషం, కృత్రిమం....

అన్నిటినుంచీ అతి దూరంగా పారిపోవాలనుకుంటున్నట్లు ఆవేశంగా నడుస్తున్నాడు రమేష్.

నప్లయర్ విజయంలో తన ఘోరపరాజయం.

ఎంత క్రూరమైనది జీవితం!

నిర్ణయం కాని గమ్యంవంక నడచి నడచి చీకటి చిక్కపడేసరికి సముద్ర తీరానికి చేరుకున్నాడు రమేష్.

శీతాకాలం కావడాన బీచ్ నిర్జనంగా వుంది.

మున్సిపాలిటీ పొదుపు అవలంబించడం మూలాన విద్యుద్దీపాలు వెలగక—చీకటిగా వుంది.

సూటిగా చెప్పాలంటే – అక్కడి వాతావరణం ఆత్మహత్య కనుకూలంగా వుంది.

రమేష్ పరిస్థితికూడా అందుకు ప్రోత్సహిస్తున్నట్లుగానే వుంది.

అతని మెదడు–మరో నరకంలా వుంది.

జీవితం బహుదుర్భరంగా తోస్తోంది.

ఆత్మహత్య చేసుకునేవాడు ఒక్కసారి గతం గుర్తుకు తెచ్చుకుంటాడు.

రమేష్ కూడా అదే చేస్తున్నాడు.

బి. ఏ. పాసయ్యాడు తను. అంతా అయిపోయాక తెలిసివచ్చిన నిజమేమిటంటే డిగ్రీకి ఏమయినా విలువంటూ వుంటే విజ్ఞాన పరంగానే తప్ప జీవనోపాధి దృష్ట్యా ఏ మాత్రమూ కాదని.

రెండు సంవత్సరాలు – ఆ నిజం బలపడింది. ఏ డిగ్రీకోసం పగలూ రాత్రి తను శ్రమించాడో, కుటుంబాన్ని అప్పుల పాలూ యాతనల పాలూ చేశాడో, నాలుగు వేలు తగలేశాడో – ఆ డిగ్రీ ఎందుకూ కొరగాకపోయింది. డిగ్రీ తెచ్చుకున్నాక తను వాళ్ళని అందలం ఎక్కిస్తాడని ఆశపడ్డారు. అమ్మా, నాన్నా, చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ. తండ్రిని ఆదుకోవలసిన తను యింకా వాళ్ళమీద ఆధారపడవలసి రావడం ఎంత దుస్సహమయిన శిక్ష! ఆ రోజుల్లో నిరుద్యోగిగా గడచిన ఆ రోజుల్లో తల వంచుకుని తిరిగేవాడు.


హేళనలు .... వెటకరింపులు సానుభూతి వచనాలు, సలహాలు, అన్నీ వేదనా వినిపించేవి. చదివిన చదువుమీదా, బ్రతుకుతున్న బ్రతుకుమీదా రోత పెరిగిపోతూండేది దినదినానికీ.

ఉద్యోగం గగన కుసుమమై పోయింది.

జీవితం మృత్యు శాపం అయిపోయింది.

మండు వేసవి అనంతరం తొలకరిలా వచ్చింది ఉద్యోగావకాశం. మహావరం అనిపించిందా రోజుల్లో.

నిజానికి ఉద్యోగవరాన్ని ప్రసాదిం




చింది డిగ్రీ దేవత కానే కాదు.

సేల్స్‌మన్ పోస్టుకి ఎస్.ఎస్.ఎల్.సి. చాలు. నిండయిన విగ్రహం, ఇంప్రెసివ్ ఫేస్... మూడు వందల కట్నమూ యివే సంపాయించి పెట్టాయి ఉద్యోగాన్ని. డిగ్రీకి అదనంగా ఓ యింక్రిమెంటయినా యివ్వరు కంపెనీ వాళ్ళు.

ఈ ఉద్యోగం—మెరిసే కత్తి అంచు అని ఏ సూత్రం ముందు తెలిసినా .... ఉహుం, ఆ రోజులు అటువంటివి. రమారమి రెండు వందల జీతం స్వర్గంలా తోచింది. అంతేకాని ఆ వరం వెనుక శాపాలు వినిపించుకో గలిగే స్థితిలో లేడు తను.

ఉద్యోగంలో కుదువ బెట్టిన మనసునీ—అణిగారిపోయిన అహంభావాన్నీ ఒక్కసారి మళ్ళీ తీసుకుని వ్యక్తిత్వంగల మనిషిలా ఆలోచిస్తే ఏమిటీ ఉద్యోగం?

జోళ్ళు అమ్మడం!

ఉదయం ఎనిమిదిన్నరనుంచి రాత్రి ఎనిమిదిన్నరవరకూ ఎవరి పాదాలకోసమో నిరీక్షణ!

అబద్ధాలు.

మనసులో లేని మందహాసాలు.

నటన.

రోజుకి పదిగంటల జీవితం ఇలాగే గడుస్తుంది. కంపెనీ రూల్సు ప్రకారం సేల్స్‌మన్‌కి నాలుగు గంటలు విశ్రాంతి. ఎటొచ్చీ ఆ రూల్సన్నీ కాగితాలమేరకు మాత్రమే. రూలు ప్రకారం అయితే సేల్స్‌మన్ ఎవరి పాదాలూ పట్టుకోనవసరం లేదు కాని—

రూల్స్ దారి రూల్సుంది. రొటీన్‌లో రూల్‌కి తావుండదు. అన్నిటికీ అలవాటు పడాలి, కంపెనీకి కావలసింది బిజినెస్. ఎటువంటి మనిషి వచ్చినా ఎవరెవరేయే హిరణ్యాక్షవరాలు కోరినా ఓపికతో విని, మంచితోనో వంచనతోనో ఓ జోళ్ళ జత అంటకడితే అదీ ప్రయోజకత్వం!....అదే ఘన విజయం. సేల్ కోసం ఆరాటం. సేల్ మీద ఆశలు.

షాపుకి వచ్చే మనుషులెన్ని రకాలు!

కొనడానికి వచ్చేవారు కొందరయితే కేవలం ఫ్యానుల కింద కూర్చుని విశ్రాంతి తీసుకుంటూ సిగరెట్ కాల్చుకుందుకు వచ్చే వారు కొందరు

కొందరికి బేరాలు చేసి ఏమీ కొనకుండా వెళ్ళిపోవడం సరదా.

పిల్లందరిలో కొనేవాళ్ళకోసం వలలు పన్ని....ఛీ ఛీ...

అంతా వంచన.... ఆత్మ వంచన.

ఏం బ్రతుకిది?

ఎందుకొచ్చిన బ్రతుకు?

ఇలాగ బ్రతక్కపోతే ఏం?

ఉద్రేకంతో లేచాడు రమేషు.

తను చచ్చిపోయాక—తన కుటుంబం గతి ఏమిటి? ఫరవాలేదు.

ఇన్సూరెన్స్ ఏజంట్ ధర్మమా అని తన బ్రతుక్కి ఐదువేల రూపాయలు.... కాదూ .... ప్రమాదవశాత్తు చచ్చిపోతే రెట్టింపు విలువ వుంది.. తన విలువ బ్రతికుంటే ఏమీలేదు చచ్చిపోతే పదివేల రూపాయలు! ఈ మొత్తంతో తన కుటుంబం ఒడ్డున పడగలదు. తమ్ముడు అందుకుంటాడు బాధ్యతలను. తను అందుచేత నిరభ్యంతరంగా ఆత్మహత్య చేసుకోవచ్చు.

చీకటి దట్టంగా వుంది. గాలి తడి తడిగా చల్లగా వుంది—నీటి మీదుగా వస్తూండడం మూలాన.

పైన నల్లని ఆకాశం.

ఆకాశంలో క్లియోపాత్రా కన్నీటి బిందువుల్లా మిణుకు మిణుకుమని మెరుస్తున్న నక్షత్రాలు. అతని మెదడులో రేగుతున్న ముళ్ళ పొదల ఆలోచనలు. చివరకు బయటపడిన చేదు నిజం. సర్వర్ జయించాడు: తను ఓడిపోయాడు. తన బ్రతుకులో నైచ్యం, అల్పత్వం నిండిన బ్రతుకు.

ఇదీ ఓ బ్రతుకేనా?

ఇలాగ బ్రతకడంకంటే చావడం మేలు కాదూ?

అవునంది అంతరాత్మ.

అతను ముందుకు సాగుతున్నాడు.

మెత్తని యిసుక...

మెల్ల మెల్లగా అలలు.

చీకటిలో ఏమీ కనిపించడం లేదు.

అడుగులు ముందుకు పడుతున్నాయి తడబడుతూ.

ఆపాదమస్తకం కంపించి పోతున్నాడు రమేషు.

వెనుకెరటం బండరాతికి ఢీ కొని తలం

బద్దలు కొట్టుకున్న శబ్దం.

మోకాళ్ళు దాటి తొడల లోతుకి వస్తున్నాయి నీళ్ళు. కొద్ది అడుగులు ... అంతే. ఇక అతను నడవ నవసరం వుండదు. కెరటాలే లాక్కుంటాయి తమలోకి.

ముందుకి నడుస్తున్నాడు రమేష.

ఇక ఒక్క అడుగు.

హటాత్తుగా ఎవరో వెనక్కి లాగేరు.

"మిస్టర్! ఏమిటిది?".

రమేష ఏమీ అనలేదు.

అతని బలానికి లొంగిపోతూ వెనక్కి వచ్చాడు.

ఇద్దరూ యిసుకలో కూర్చున్నారు.

చీకటి మరీ చిక్కగా ఉంది.

ఒకరి ముఖం ఒకరికి కనిపించనంత దట్టమయిన చీకటి.

"జీవితం చాలా చిత్రమైనది మిస్టర్! చూడు.... నే నిక్కడికి ఎందుకు వచ్చానో తెలుసా?"

"అనవసరంగా నన్ను రక్షించడానికి."

"కాదు. ఆత్మహత్య చేసుకుందామని."

"ఆ!"

"అవును. నిజంగా నేను ఆత్మహత్య చేసుకోవాలనే యిక్కడకు వచ్చాను. కాని జరిగిందేమిటి? నాలాగే ప్రయత్నిస్తున్న నిన్ను....ఆటంకపరిచాను. సారీ...."

"మీరెందుకు ఆత్మహత్య చేసుకోదలిచారు?" అడిగాడు రమేష కుతూహలంగా.

"ఒక గొప్ప నేరంచేశాను. నిష్కృతి లేని నేరం. అందుకు నన్ను నేనే శిక్షించుకుందామని...."

"మీరు చేసిన ఘోరమైన ఆ నేర మేమిటి?"

"మీది చాలా చిన్న ప్రశ్న. సమాధానం మాత్రం ఓ జీవిత కథ. చెప్పే ఓపిక నాకుంది. నిజానికి నాకథ వినగలిగే మనిషంటూ దొరికితే అంతా చెప్పాలని నేనెన్నాళ్ళనుంచో అనుకుంటున్నాను. ఇప్పుడు - ఆత్మహత్య చేసుకోబోయే


తాంత్రిక ఉంగరం



9వ ప్రపంచ విచిత్రం, ప్రేమ, వివాహం, ఆర్థిక, ఆరోగ్య, పరీక్ష, తగాదా, ఉద్యోగం— అన్ని విషయాలలో అద్భుతంగా విజయం చేకూరుస్తుంది. దుష్టగ్రహాల బారినించి రక్షిస్తుంది. వశీకరణ శక్తి కలది. వేలాదిగా ఉపయోగించారు. తాంత్రిక ఉంగరం వెల రూ. 2/50. స్పెషల్ రూ. 5/50. ఎక్స్ట్రా స్పెషల్ రూ. 11/25 పోస్టేజి అదనం. ఆమోదము పొందనిచో డబ్బు వాపసు. నేడే పోస్టు కార్డు వ్రాయండి.

MAHAKALI TANTRIK KARYALAYA
116, Lajpat Rai Market,
DELHI-6

ముందు-నాకోరిక నెరవేరితే అంతకంటె కావలసిందేముంది నాకు?"

"చెప్పండి వింటాను."

"థాంక్స్. ఆశించని అదృష్టంలా దొరికారు మీరు. ఫ్రెండ్! ఆత్మహత్యకు అడ్డుపడ్డానని కోపగించుకోకండి. మనుషులు అనేక కారణాలుగా ఆత్మహత్యలకి తలపడుతారు. ఆవేశంలో చెయ్యడంకంటె ఆలోచించి చేయడం దేనికయినా మంచిది. ఏమంటారు?

మిమ్మల్ని ఆపడం నా అభిమతంకాదు. నేను చెప్పబోయే విషయాలు—మీరు శ్రోతలా వినండి. చాలు. తరువాత మనం యిద్దరమూ కలిసి...."

"సరే చెప్పండి."

"ఒక మనవి వినండి. ఇది కథ కాదు. జీవితం. నేను రచయితను కాను. మనిషిని. మామూలు మనిషిని. అందుచేత నేను చెప్పబోయే విషయాలకు ఆకర్షణీయమయిన రూపం యివ్వలేను. చెప్పబోయే విషయాలన్నీ చేదు నిజాలు. వింత నిజాలు."

"ఊఁ."

ఆతను గొంతు సవరించుకున్నాడు.

[illegible] సర్దుకుని చెప్తున్నాడు.

"ఈ రోజులలో కూడా శాపాలూ శాపగ్రస్తులూ ఉంటారనేందుకు నిదర్శనం నేను.

ఎనిమిదవ యేట అమ్మ చచ్చిపోయింది. ఆమె చనిపోయాక నా వంటి మీద సజీవ స్పర్శ తాలూకు అనుభూతి అనుభవమూ కరువైపోయాయి.

జీవితం చీకటి మయమైపోయింది.

ఒంటరి తనంలో క్రుళ్ళిపోసాగాను.

నా ముఖంలో పాపాలు గూడు కట్టినట్లు ఎవరూ నా ముఖం చూసేవారు కాదు

పాము పడగనీడ నుంచి పసిపాపలు కూడా పారిపోతారు.

పిశాచపు పొడగు - పగవారు కూడా కోరరు.

నా జీవితం అలాగే అయింది.

సమాజం నన్ను వెలివేసింది.

నేనుచేయని నేరానికి నాకు శిక్షపడింది.

కొంచమయినా సానుభూతి చూపకుండా నామీద కసి చూపసాగారు పలుగురూ.

మాతృ ప్రేమ నుంచి దూరమయ్యాను మిగిలినదేమిటంటే—లక్ష రూపాయల ఆస్తి ..

డబ్బుంటే కొండమీది కోతి దిగివస్తుందంటారు.

నా అనుభవాలు ఆ సూత్రానికి వ్యతిరేకంగా ఉన్నాయి. ఆ మేడలో - మారుమూల గదిలో ఒకరిద్దరు నౌకర్ల సాయంతో ఒంటరి జీవితం సాగిస్తున్నాను నేను. మిత్రులంటూ ఉంటే-పుస్తకాలు మాత్రమే. పత్రికలూ, పుస్తకాలూ అవే నా ఒంటరి జీవితానికీ బాహ్య ప్రపంచానికీ వంతెనలు. అవే నాకు కాలక్షేపం.

నౌకర్లు కూడా నా ముఖం చూడరు.

రోడ్డు మీదకు అడుగుపెడితే - కనుచూపు మేరదూరంలో మనుషులుండరు.

అందుచేత నాచుట్నూ గిరిగీసుకుని బ్రతకడమే అలవాటు చేసుకున్నాను.

ఒంటరితనం—సంవత్సరాల తరబడి—దశాబ్దాల తరబడి ఒంటరితనం.

విసుగెత్తిపోయింది.

ఒంటరితనపు గూటిలో శాశ్వత ఖైదీగా జీవితం వెళ్ళబుచ్చలేననిపించింది మానవుల నడుమ తిరుగాడాలనిపించింది.

ఈ ఉదయం ఒక నిర్ణయానికివచ్చాను.

జీవితంలోని భయంకరత్వాన్నీ, జుగుప్సనీ, దుర్మార్గాన్నీ పరిశీలించి—ఎదుర్కొని గెలిస్తే అలా అవకాశాలూ కనపడక పోతే—ఆత్మహత్య చేసుకోవాలి. అందుచేత యివాళ నన్ను నేనే రకరకాల పరీక్షలకు గురిచేసుకున్నాను"

ఎదురు ప్రశ్న వేయకుండా వింటున్నాడు రమేషు.

అతని ముఖం చూడాలని విశ్వప్రయత్నంచేసి మరీ ఓడిపోయాడు రమేషు.

"అవసరంలేని మందుకోసం హాస్పిటల్‌కి వెళ్లాను. క్యూలో నిలబడదామని ప్రయత్నించబోయాను. అందరూ పారిపోయి అల్లకల్లోలం చేసేశారు. నాకు దగ్గరలో ఎవరూ మిగలలేదు. ఫలితం—నా వొక్కడికే స్పెషల్ క్యూ. నాపై గౌరవంవల్ల కాదు. నేనంటే భయపడిపోయారు. నన్ను చూసి అసహ్యించుకుని కూడాను.

నర్సు వచ్చి అవతలకు పొమ్మని కసిరింది. నేను కదలలేదు.

చేసేదిలేక-ఇంగ్లీషులో తిడుతూ వెళ్ళిపోయింది పాపం ఆమెకు తెలియదు—నాకు చదువొచ్చునని. నా అంతట నేనే చదువు నేర్చుకున్నాను పుస్తకాల ద్వారా. ప్రపంచం ఎలా సాగుతూందో పత్రికలూ పుస్తకాలూ నాకు చెప్పేవి.

నర్సు వెళ్లాక డాక్టరు వచ్చాడు.

పల్సు చూడమని చెయ్యి చాపాను.

నా ముఖం చూసి—త్రుళ్ళిపడ్డాడు. తిట్లు మొదలు పెట్టాడు. బాధ నటిస్తూ అరవసాగాను. అతను నన్ను లక్ష్య పెట్టలేదు. కొంచమయినా కరగ లేదు. నేను బండలా మొండిగా నిలబడ్డాను అన్నిటికీ తెగించాను.

వార్డుబోయ్‌ని పిలిచాడు డాక్టరు. ఈ రాస్కెల్‌ని అవతలకి గెంటెయ్యి—అంటూ ఆజ్ఞాపించాడు. వార్డుబోయ్‌కూడా నన్ను చూసి నిర్ఘాంతపోయి—నన్ను ముట్టుకుందుకు అసహ్యించు కుంటున్నట్లు కర్ర తీసుకు వచ్చాడు.

మీరు నమ్మరు. నమ్మలేరు. శవాల తోలు వొలిచే డాక్టర్.. సజీవ మానవుడి కండరం కోసి, రక్తం పిండి, పేగులను సవరించే డాక్టర్—నన్ను అసహ్యించుకున్నాడు! సేవకి ప్రతి రూపం అనుకున్న నర్సు నన్ను చూసి అసహ్యించుకుంది.

పేషంట్లకు స్వర్గతుల్యమైన హాస్పిటల్ నా రాకతో జలదరించింది.

గజ్జి కుక్కను తరిమి కొట్టినట్లు వాళ్ళంతా నన్ను తరిమి కొట్టారు. నేను ధరించిన దుస్తులు కూడా నన్ను కాపాడ

లేక పోయాయి.

కరుణ చూపవలసిన వైద్య సిబ్బంది కర్రపుచ్చుకొని కొట్టారు.

నా కలంలో ఒకటి—కరిగిపోయింది.

మొదటి పరీక్షలో పరాజయం ఎదురైంది. నే నాట్టే బాధపడలేదు. ముందుగా వూహించుకున్న ఫలితం బాధల బరువుని తగ్గించింది.

నాకు తెలుసు. నేను అస్పృశ్యుడి కంటె అల్పుడిని. మనిషి చేత వెలివేయబడిన మనిషిని. ఏ మనిషీ నన్ను రెండవ సారి చూడటానికి ఇష్టపడదు.

నా రూపం అటువంటిది.

నా వ్యాధి అటువంటి జుగుప్సాకరమైనది.

రెండవ పరీక్షకు ఆయత్తమయ్యాను.

రమేషు అతనికి దూరంగా జరిగాడు.

అది గమనించనట్లు అతను మళ్లీ చెప్పసాగాడు. 'ఈ సారి నేను—మనిషి గర్వపడుతూ బ్రతుకుతున్న నేటి సమాజంలో—అట్టడుగు మెట్టుమీద అనాధగా బ్రతుకుతున్న వేశ్యముందు నా జీవితాన్ని పరీక్షించదలచుకున్నాను.

వేశ్య- సమాజానికి డస్టుబిన్.

డబ్బుకోసం ఏ క్షణమయినా, శరీరాన్ని కుదువబెట్టి- ఎవరి చేతుల్లో అయినా పంకిలం కావటానికి సంసిద్ధురాలిగా వుంటుందని చెప్పబడే పణ్యాంగనను పరీక్షించదలచుకున్నాను.


సామాజిక జీవనానికి దర్పణంపట్టే సాహిత్యాన్ని నేనెంతో ఆరాధనంగా చదివాను. ఒంటరితనంలో ఉన్నా—వృత్తిరీత్యా ధర్మమూ అని—సమాజానికి దగ్గరగా ఉన్నట్లు అనుభూతి చెందేవాడిని. అందుకనే—చాలా సంవత్సరాలకు—మొదటిసారిగా సమాజంలో అడుగుపెట్టినా—మనుష్యుల మధ్య నేను కొత్తవాడిలా ఉండలేదు. అలవాటుపడిన వాడిలానే ప్రవర్తించగలిగాను. సరే .... అసలు విషయంలోకి వద్దాం.

ఊరికవతల—

ఊరికి కాలువ పడున—అతి చిన్న గుడిసెలో-చావలేక బ్రతుకుతున్నట్లు—వొంటినిండా కప్పుకుందుకు గుడ్డలేక—అర్ధనగ్నంగా బ్రతుకుతున్న ఆ వేశ్య-సివిలైజ్డ్ సొసైటీకి డస్టుబిన్ వంటిది. పెద్దవాళ్ళ సంభాషణలో "[illegible]". ముఖం చూసి చెప్పెయ్యవచ్చు—మూడురోజుల నుంచి తిండి ముఖం ఎరగదని.

ఆ కట్టెలో—ఆకర్షణంలేదు. అందం లేదు.

స్త్రీత్వం, సౌందర్యం, లావణ్యం- ఏమీలేక-క్షీణించిన రోగాలకు రూపకల్పన చేసినట్లున్న ఆమెకు- ఐదు రూపాయలు అద్దెకు కోరాను. చెల్లించదలచుకున్న మూల్యం ఎదురుగా పెడుతున్నాని చెప్పాను. నాకూ అందానికీ వెయ్యి ఆమడల దూరం. అయినా నా హృదయానికి అందచందాల విచక్షణా జ్ఞానం అలవడింది. నేనెంత వికారంగా ఉన్నా— నా మనసుకి మాత్రం




అందచందాలను బేరీజు వేయగలిగే శక్తి ఉంది,

ఆమె—ఏమీ అందంగా ఉండదనడం కంటె—పరమ అసహ్యంగా ఉంటుం దనడమే వాస్తవానికి సమీపంగా ఉంటుంది.

నాకోరిక విని—

శరీరం నిండా ముసురు కుంటున్న ఈగలనూ పురుగులనూకూడా అసహ్యం మకోకుండా భరించగల్గుతున్న ఆ స్త్రీ నా వంక ఎంత అసహ్యంగా చూసిందనీ!

నన్నొక్కసారి చూసి-కళ్లు గట్టిగా మూసుకుంది.

"ఐదు కాకపోతే యాభై తీసుకో." అన్నాను ఆత్రతగా. ఆమె నన్నంగీకరిస్తే నా జీవితం నిలబడుతుంది. నా బ్రతుక్కి భరోసా దొరుకుతుంది. నన్నుకూడా భరించగలిగే మనిషొకరున్నారన్న తృప్తితో నేను జీవించవచ్చు. ఆమె కూడా తిరస్కరిస్తే-నా ఆశా తంతువు తెగిపో తుంది. నా జీవితం, ఉనికీ నిరర్ధకమని నిరూపితమౌతుంది. అందుకే నా కంత ఆత్రత. జీవితంలోఉన్న అతివిచిత్రమయిన లక్షణమేమిటంటే-ఏ చిన్న ఆశాకిరణం కనిపించినా — అన్ని అవరోధాలనూ దాటడానికి ప్రయత్నించే శక్తి ఏర్పడటం.

నా అభ్యర్ధనకు సమాధానంగా - నా ముఖంమీదే తలుపులు మూసివేసింది. ఎంత కర్కశమైన తిరస్కృతి!

బాధతో తల వంచుకున్నాను.

రెండవసారికూడా ఘోరంగా ఓడి పోయాను

మెదడుకి పదునుపెట్టి ఆలోచించు మిస్టర్! నేను చెప్పిన వాటిలో అబద్ధాలూ అతిశయోక్తులూ ఏమీలేవు. అన్నీ పచ్చి నిజాలు, వెగటు నిజాలు. నేను చెప్పే

అనుభవాలలోని ప్రధానపాత్ర మీ ముందే ఉంది. నా అనుభవాలకీ, నేను పొందిన బాధకీ చేతనైనంతవరకు వాక్చిత్రంగా తయారుచేసి మీ ముందుంచడమే నా ఉద్దేశం. అక్కడినుండి తిరిగివస్తున్నాను.

ఒక ముష్టివాడు ఎదురయ్యాడు.

మన దేశం ముష్టివాళ్ళకి ప్రసిద్ధి కదూ? ఏదో ఫారిన్ మాగజీన్‌లో చదివాను- భారతదేశం బెగ్గర్స్‌కి ప్రసిద్ధని, ఈదేశం బీదదేశం. అంతకంటె చేదు నిజమేమిటంటే-యీ మనుషులవి మరీ బీద మనసులు!

జాలి కొద్దీ జేబులోంచి పది పైసల నాణెంతీసి-ఆ ముష్టివాడికి వేయబోయాను.

వాడు నా ముఖం చూశాడంతే.

చెయ్యి వెనక్కి లాగేసుకున్నాడు.

నాణెం నేలమీద పడిపోయింది. వాడు దానివంక అసహ్యంగా చూసి-త్వరత్వరగా వెళ్ళిపోయాడు!

మరొక్క అనుభవం చెప్తాను.

ఉదయంనుంచీ ఊరుమీదే తిరుగుతున్నాను కదా? ఆకలి మండిపోయింది. జేబునిండా డబ్బుంది.

హోటల్లో ఏమయినా తినవచ్చుకదా అని అడుగు పెట్టాను...."

"చెప్పనవసరంలేదు," అడ్డగించాడు రమేష్.

"ఏం?"

"ఊహించగలను." ఆ సన్నివేశంలో తనూ పాల్గొన్నాడని చెప్పలేక అబద్ధమాడాడు రమేష్ — మరి కొంచెం దూరంగా జరుగుతూ.

"సరే....ఇలాగా ఓడిపోయాను నేను. మనుషులు .... నన్ను పిచ్చికుక్కను తరిమినట్లు తరిమారు. నాపైనుండి వచ్చే గాలి తమకు తగిలితే ఏమౌతుందో అన్న భయంతో నానుంచి దూరంగా పారిపోయారు. నేను కలుషితం చేసిన గాలి సోకకుండా ముక్కు మూసుకున్నారు. నా ఆకారం చూడవలసివస్తుందని కళ్ళు మూసుకున్నారు.

మానవులలో నేనూ ఒకడినని-కనీసం అలాగ ఆత్మవంచన చేసుకుంటూ అయినా మరో నాలుగు రోజులు బ్రతికే అవకాశం లేకుండా చేసేశారు.

ఇదీ సమాజం! ఇది మానవజాతి! ఇటువంటి వాళ్ళతో కలసిమెలసి జీవిద్దామని తహ తహలాడిపోయాను. అటువంటి అదృష్టం కోసం ఏళ్ళ తరబడి ఎదురు చూశాను. కాని చివరకు మిగిలిందేమిటి?

నేను చదివినవి కథలే అని నిజ జీవితంలో ఏ మనిషీ దయామయుడు కాడనీ, ఎవరిలోనూ మానవత్వం లేదనీ, నావన్నీ కలలే అనీ నిరూపించబడ్డాయి.

ఇంక ఎలా జీవించేది?

ఏదో దేశంలో లెప్పర్స్ నందరినీ బాగు చేస్తామని ఆశపెట్టి, ఎక్కడికో తీసుకెళ్ళి షూట్ చేసి వాళ్ళకి దేశానికీ విముక్తి కలిగించారట! నేను చదివానలా. అనుక్షణం నరక సదృశమయిన సుదీర్ఘ జీవనంకంటే

ఆకస్మిక మరణమే మేలు. కాని యీ దేశంలో అటువంటి సహృదయులుకూడా కరువే. మా బ్రతుకులిలా తెల్లవార వలసిందే."

రమేషు మరింత దూరంగా జరగబోయాడు.

అతను వికృతంగా నవ్వి 'భయపడుతున్నావా మిస్టర్? నాది అంటువ్యాధికాదు. నా జబ్బు నాన్ కంటేజియస్. అన్నట్లు... ఒకటి మరిచాను. నేను చేసిన నేరం చెప్పలేదు. కొంచెం ఓపిక పడితే అదీ చెప్పేసి ఆత్మహత్య చేసుకుంటాను.

అమ్మ చచ్చిపోయాక యిన్నేళ్ళకిఇన్ని పరాభవాల మధ్య, యిన్ని అపజయాల మధ్య నాకూ గెలుపు దొరికింది, అతనొక పసివాడు. బ్రతుకులోని బాధ చేదూ తెలియని వాడు. సమాజంలో కుళ్ళు తెలియని వాడు నా వొళ్ళు చూసి జాలిపడిన వాడు.

అతను మంచివాడు. అతను దేవుడు. అతను మరో మహాత్మాగాంధి.

అందరిలా అతను నా గుండెలో గునపాలు గ్రుచ్చలేదు. గాయాలు తిని తిని నా హృదయం స్రవిస్తున్న రక్తపుబొట్లు తుడిచి నా మనసుకి మందు వేశాడు.

ఈ శాపగ్రస్తుడిపట్ల అతను దైవంలా కరుణించాడు.

అతను మానవత్వమున్న మనిషి. నిజమయిన మనిషి. సజీవ మానవ స్పర్శ కోసం సంవత్సరాల తరబడి తహతహలాడుతూ తపించిపోతున్న నాకు ఆ స్పర్శ సుఖం కలిగించాడతను. ఆ మంచి మనిషి స్వహస్తాంతో, ఆప్యాయంగా, ఆదరంగా మొద్దుబారిన నా పాదాలకు రక్షలు తొడిగాడు.

ఆ చల్లని స్పర్శ, దానిలోని మాధుర్యం, శక్తి...అది నాలో రేకెత్తించిన జీవన వాంఛ. అదంతా మాటలలోచెప్పడం నా తరం కాదు.

చనిపోయే ముందు అతనికి నా కృతజ్ఞతలు తెలుపుకోవాలి.

కాని కుదరలేదు.

అతని వంటి మనిషి అతను తప్ప మరొకడు లేడు...."

ఇక వినలేకపోయాడు రమేషు.

ఒక్కసారి అరిచాడు— "వొద్దు. అతనికంత అర్హత లేదు. అతనూ మామూలు మనిషే. విద్యుక్త ధర్మం నిర్వర్తించేందుకు విధిలేక విన్నసహ్యించుకుంటూనే నీ పాదాలకు జోళ్ళు తొడిగాడు. అలా చేయవలసి వచ్చినందుకు జీవితం మీద అసహ్యం పెంచుకుని ఆత్మహత్య చేసుకోవాలని...." ఒక్క క్షణం ఆగి అన్నాడు. "నీ పాదాలకు జోళ్లు తొడిగిన మనిషిని నేనే. నాలో నువ్వనుకుంటున్న ఔన్నత్యం ఏమీలేదు. నేను నీ మీద జాలి పడి అలా ప్రవర్తించడం జరగలేదు. నువ్వు గెలుపు తీసుకోవడం భరించలేక ఆత్మహత్యచేసుకుందుకే యిక్కడికి వచ్చాను."

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం ఆవరించింది.

దాన్ని భగ్నం చేస్తూ సముద్రపు ఘోష.

కెరటాలగలగలలు.

చివరకన్నాడతను "వొద్దు మిస్టర్! నా మూలంగా నువ్వు చచ్చిపోవద్దు. నేరం చేసింది నేను. శిక్ష అనుభవించ వలసింది నేనే, నేను చేసిన నేరానికి నీకు నువ్వు శిక్ష విధించుకుంటే నా నేరం మరీ ఎక్కువవుతుంది.

నేను నీపై తీసుకున్న గెలుపు నాకు వద్దు. నువ్వే తీసుకో.

ఎలాగూ నా జీవితం చీకటి దీపం. నా కోసం నీ జీవితాన్ని నాశనం చేసుకోవద్దు, నేను వెడుతున్నాను. పాముపడగ నీడని విశాలపు సుఖాన్ని నాది ఒట్టి నిరర్థక మయిన బ్రతుకు.

పచ్చని నీ జీవితంలో చిచ్చు పెట్టా నన్న భావం నన్ను దహించేస్తూంది. నా కోసం నువ్వు నాశనం గావద్దు.

నీ పట్ల నిజంగా నేను చాలా ద్రోహం చేశాను. అందుకిప్పుడమితంగా పశ్చాత్తాప పడుతున్నాను.

టచ్ మినాట్ అనే మొక్క తెలుసు కదూ? ఎవరయినా ముట్టుకుంటే ముడుచుకు పోతుంది.

సరిగ్గా వ్యతిరేకం నేను, మనుషుల కోసం తపించిపోయాను. ఎవరూ చేర నివ్వక దహించుకుపోయింది నా బ్రతుకు నా ఆవేశాన్ని అర్థం చేసుకోగలవుకదూ?

ఆ వేళలో ఉచితానుచితాలు విస్మరించాను,

నీమీద గెలుపు తీసుకున్నాను. నీ మనసు విరిచేశాను. నేను చేసిన నేరం తలచుకుంటూంటే పశ్చాత్తాపంతో నా గుండె బ్రద్దలౌతూంది.

నన్ను క్షమించు మిస్టర్, మనసారా నన్ను క్షమించు. నిన్ను ప్రార్థిస్తున్నాను. నన్ను క్షమించవూ?

ఎండిపోయిన నా గుండెలో ఒక క్షణమయినా అమృతం కురిపించిన వాడివి నువ్వే.

నీ మేలుకి ప్రతిఫలంగా నీ జీవితాన్ని బలి చెయ్యడం ఎంత మాత్రమూ నా తరం కాదు. నువ్వు మరే శిక్ష విధించినా సంతోషంగా స్వీకరిస్తాను.

నా బ్రతుకొక చీకటి దీపం. దీని క్రీనీడలు ఎవరి మీదా పడకూడదు. ఈ చీకటి నాతోనే అంతరించిపోవాలి తప్ప మరో జీవితాన్ని ఆవరించకూడదు.

ఈ చివరి క్షణాలలో....నా చిట్టచివరి చిన్నకోరికను మన్నించడం మనిషిగా నీ ధర్మం.జరిగినదంతా మరచిపో

అదొక పీడ కలగా భావించి మరచిపో

చాలా రాత్రయింది. ఇంటికి వెళ్ళిపో నీ కోసం మీ వాళ్ళు ఎదురుచూస్తూంటారు ప్లీజ్.. మిస్టర్ .... వెళ్ళిపో. నాకు ఏకాంతం కావాలి. చివరి క్షణాలలో నన్ను ఒంటరిగా మిగలనీ."

శిలా సదృశంగా మిగిలిపోయాడు రమేష్.